మొహమాటం మాటున కథకులు

కాసల నాగభూషణం

'గురూగారూ!గుడీవెనింగ్'

ఆ మాటని వింటూనే గుర్తుపట్టేను అది గురుమూర్తి గొంతని. పుస్తకంలోంచి తల పైకెత్తి చూసేను. అప్పటికే బాగా దగ్గరికొచ్చేసేడు గురుమూర్తి.

నేను పుస్తకం మూసి ఈజీ చెయిర్లోనే వెనక్కి వాలుతూ పక్కనే వున్న కుర్చీని చూపించేను అతనికి.

"ఏమిటో చదువుతున్నారు?" కూర్చుంటూ అడిగేడు గురుమూర్తి.

"మామూలేగా" అన్నాను నేనూ అతిమామూలుగానే,

అంతలో లోపల్నుంచి అడిగింది అపర్ణ-శ్రీమతి-"ఏమండీ కాఫీ తేనా?" అని.

"తీసుకురా! గురుమూర్తి కూడా వచ్చేడు" అన్నాన్నేను కిటికీ కర్టెన్ తొలగించి లోపలికి చూస్తూ

సాయంకాలపు ఎండ వరండాకి కుడి వేపు మెత్తగా తాకుతోంది పూలమొక్కల్ని. వూరికి చివర కాస్తంత ఎత్తయిన చోట వుండడం వల్ల ఒంటికి హాయిగా తగులుతూ వీస్తోంది గాలి. అల్లాంటి సమయాల్లో వాలుకుర్చీ వేసుకుని పుస్తకాలు చదువుకుంటూ ఈ గురుమూర్తిలాంటి మిత్రులతో సాహిత్య చర్చ చేసేపాటి అవకాశం కలగడం-నిజంగా నా అదృష్టం!

ఇక గురుమూర్తిని గురించి చెప్పవలసొస్తే...

అతనే ప్రథమ పాఠకుడు నా ప్రతి రచనకీ. రఫ్‌గా రాస్తోండగానో ఫేర్ కాపీ చేస్తోండగానే వచ్చేవాడు గురుమూర్తి మాఇంటికి, స్నేహపూర్వకంగానే నన్ను తొందర చేసి, నాచేత ఆ రచనని తొందరగా పూర్తి చేయించి, ఓపిగ్గా అక్కడే కూచుని చదివి తనఅభిప్రాయం చెప్పి మరీ వెళ్ళేవాడు. రాసినవాడి పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా ఎరిగుండీ, వాడి ఎదురుగానే కూచుని చదవడం సంభవిస్తే ఓ రచనని దానిమీద నిష్పక్షపాతమైన అభిప్రాయానికి రాలేడు పాఠకుడు-అనుకునేవాణ్ని నేను. అయినా ఆ అనుమానం లోపల నలుపుకున్నా అతని వుత్సాహం చూసి ఇచ్చేవాణ్ని స్క్రిప్టుని గురుమూర్తికి.

రసజ్ఞుడైన పాఠకుడే నిజమైన బంధువు రచయితకి.

అలా బంధువే అవుతాడు నాకు గురుమూర్తి. [illegible] కూడా [illegible] [illegible] అన్నా.

ఆమె వచ్చింది ట్రేలో కాఫీలూ,వక్క పొడి వుంచుకుని.

గురుమూర్తే ఓ కాఫీకప్పు ఇచ్చేడు నాకు తనూ ఒకటి తీసుకున్నాడు.

కాఫీలయ్యేక కప్పులు తీసికెళ్ళింది అపర్ణ.

చేతిలోకి వక్కపొడి తీసుకుంటూ అడిగేడు గురుమూర్తి

"ఇవాళ మీకో షాకింగ్ న్యూస్ చెప్పనా?" చూసేను ఏమిటన్నట్టు

"నేనూ ఓ కథ రాసేను" చెప్పేడు తాపీగా.

అతనన్నట్టు నాపట్టుకు అది షాకింగ్ న్యూస్ కాదు.

ఆంధ్రదేశంలో చదువుకున్న ప్రతి నలుగుర్లోనూ ఓ రచయిత వున్నాట్ట. ఆ నలుగుర్లోనూ మా గురుమూర్తి ఒకడు కావడం నాకు మరీ ఆశ్చర్యం కాదు.

ఎందుకంటే పూర్వాశ్రమంలో ఎప్పుడూ అట్లాంటి అభిరుచి వున్న వ్యక్తిలా కనిపించలేదు నాకు గురుమూర్తి

'ఏదీ తెచ్చేవా?' అడిగేను సరిగా కూచుంటూ.

"నాకేదోలావుంది మీకు చూపాలంటే" జేబులోంచి మడిచి వుంచిన ఓ సగం తావు కాగితాన్ని తీసి చేతబట్టుకుని అన్నాడు గురుమూర్తి.

"కాకారుడు సిగ్గుపడితే పైకి రావడం కుదర దబ్బాయ్" అంటూ అందుకున్నాన్నేను ఆకాగితాన్ని. మడత విప్పేను.

నిజం చెప్పాలి-కథ రాసే న్నాడు గురుమూర్తి. ఆ సగం తావులోనూ సగానికి సగం ఖాళీ. తక్కిన సగమే "కథ" మొత్తం ఒకే ఒక్క పేరా!

ఇది మినీ కథల కాలం అయినా గురుమూర్తి చూపిన ఆ మాన్యుస్క్రిప్టుని కథ అని నేననలేను.

కానయితే అపను రాసిం దానిలో ఓ కథకి కావలసిన బలమైన ముగింపు వుంది. కాస్త పకడ్బందీగా ఆముగింపుతో సరితూగే బాడీని గనక డెవలప్ చేస్తే అదీ ఓ గొప్పకథే అవుతుంది.

అదే అన్నాను గురుమూర్తితో "ఈ మాత్రం చాలదు గురుమూర్తి! కథకి. ఇంకా పెంచాలి దీన్ని"

గురుమూర్తి తెల్లమొహం వేసేడు.

"ఎల్లా పెంచాలో నాకేం తోచడం లేదు గురూగారూ!

ఏదో ఆలోచిస్తోండగా తక్కున ఈ ఐడియా వచ్చింది. రాయాలని కూచుంటే అది ఇల్లా తయారయింది. ఇక దీన్నేం చేసినా అది మీ ఇష్టం" అంటూ ఆ బాధ్యతని నాకే అప్పగించేడు చాల తేలిగ్గా.

నేను కాసేపు ఆలోచించేను గురుమూర్తి చూపిన ఆ పాయింట్‌ని ఆధారంగా ఓ అందమైన కథని అల్లగలమా? అని, అల్లగలననే అనిపించింది.

"సరే రేపటి కొస్తావుగా-అప్పుడు చూద్దువుగాని నీ కథని" అన్నా నతనితో.

కుర్చీలోంచి లేచి నవ్వుతూ వెళ్ళొస్తానని సెలవు తీసుకున్నాడు గురుమూర్తి.

అనడం వరకయితే అన్నానుగాని ఆ రాత్రి భోజనాలయ్యేక నా గదిలో కాగితాలు ముందేసుకుని కూచున్నప్పుడే తెలిసింది-ఇతర్ల అనుభవాన్ని ఇతర్లకి నచ్చేలాగే రాయడంలో వున్న ఇబ్బంది.

సరిగా గురుమూర్తి కాగితం మీద చూపించిన సంఘటనని ఆ ముగింపుని రక్తమాంసాలు చేర్చి, జీవం పోసే సరికి రాత్రి రెండు గంటలయింది

ఆ మర్నాడు యథా ప్రకారంగా, తన కథ రూపురేఖల్ని తనివి తీరా చూసుకోవాలనే వుత్సాహంతో మరింత తొందరగా వచ్చేడు గురుమూర్తి మా ఇంటికి

నేనా కథని చూపించే నతనికి,

అందుకుంటూ "అయ్యో! ఫేర్ కూడా మీరే చేసేరా? చాల ఇబ్బంది కలిగించేను మీకు" నొచ్చుకునే ధోరణిలోనే అన్నాడు గురుమూర్తి.

సగం పుటలో తను చూపించిన కథ పన్నెండు పేజీలకి ఎల్లా పెరిగిందో అర్థం కాలేదు గురుమూర్తికి.

"చాలా పెంచేరే గురూగారూ!" అన్నాడు పేజీలు మళ్ళీ తిరగేస్తూ.

"చదివి చూడు బావుందేమో" అని అతనికి ఏకాంతాన్ని కలిగిస్తూ నేను లోపలికెళ్ళిపోయేను

కాఫీల తయారీకి శ్రీమతిని రిక్వెస్ట్ చేసుకుని, కవరూ స్టాంపులూ తీసుకుని వెళ్ళేను మళ్ళీ ఆతని దగ్గరికి

"ఇంతగా ఈ కథ డెవలప్ అవుతుందని నేనూహించలేదండి గురూగారూ! చాల బావుంది" అన్నాడు గురుమూర్తి

"అయినా నా పేరు మీదే రాసేరే కథని? -మీపేరు గదండీ వుండాలి" అని అన్నాడు అంటూనే కవర్లో ఆకాగితాల్ని మడిచి పంచి, స్టాంపుల్ని అంటించేడు

"ఏ పత్రిక్కి పంపితే బావుంటుందో ఆ అడ్రస్ ని కూడా మీ చేత్తో దీ

రాయండి" అంటూ నా ముందుంచేను.

నేను కవర్‌మీద అడ్రస్‌ని రాసేను. నాకు కష్టం కలిగించడం ఎందుకని కాబోలు పోస్ట్ చెయ్యడం మాత్రం గురుమూర్తి చేసేడు.

ఆ తర్వాత మరో కథ ఇల్లాగే గురుమూర్తి అరగొరగా రాసి చూపెడితే "రాసిపెట్టండి గురూగారూ!" అని అడిగితే ఆ మొహమాటం నుంచి తప్పించుకోలేక 'అల్లాగే' అన్నాను. అన్నంతపనీ చేసి ఇచ్చేను. ఆ రెండో కథని ఫేర్ చేస్తోండగా మా శ్రీమతికి పట్టుబడిపోయేను.

"ఎంత మొహమాటమైనా రాసింది మీరైతే మధ్యన ఆయన పేరెందుకండీ పెట్టడం" అంది అపర్ణ.

"పోనీ అపర్ణా! ఇలాగూ రాయడం అలవాటయితే మనకే మంచిది. ఏసబ్జెక్టయినా తీసుకుని తేలిగ్గా కథరాసి పడేసే టాలెంట్ వస్తుంది" అన్నాన్నేను ఓదార్పుగా.

ఆపైన ఐదారు వారాలకి అనుకుంటా టౌన్లో జిల్లా స్థాయి రచయితల సంఘం ఏర్పాట్లకోసం కొందరు రచయిత మిత్రులతో కలసి తిరుగుతున్నాన్నేను హడావిడిగా. అప్పుడు నాతో అపర్ణకూడా వచ్చింది. గురుమూర్తి వచ్చేడు.

అన్ని పనులూ పూర్తయింతర్వాత అందరం కలసి ఏదో హోటల్‌కెళ్ళేం. మేం మాటల్లో వుండగా అప్పుడే అటు వెళ్ళి కొత్తగా బజార్లోకి దిగిన పత్రికనొకదాన్ని కొని చేతబట్టుకుని చక్కావచ్చేడు గురుమూర్తి.

పక్కన కూర్చుని పేజీలు తిప్పుతున్న వాడల్లా ఠక్కున "నా కథ అచ్చయిందండోయ్!" అన్నాడు.

అతనా మాట అనడం తోటే సాభిప్రాయంగా చూసింది అపర్ణ నావైపు.

గురుమూర్తి పత్రికని ఆ పేజీ దగ్గర మడతపెట్టి అందరికీ చూపించేడు ఆ కథని.

కథకి ఆర్టిస్టు గీసిన బొమ్మ అద్భుతంగా వుంది.

నేను మెరక కని పారేసిన శకుంతలని అపురూపంగా కళ్ళలో వుంచి పెంచుకున్న కణ్వుడు చూసినట్టు చూసేను ఆ కథని.

అప్పుడు మా అందరికీ గురుమూర్తే ఆర్డరిచ్చేడు టిఫిన్‌కి. అతనే బిల్లు చెల్లించేడు. కాలేజీ రోజుల్లో నా మొదటి కథ అచ్చయినప్పుడు పోరి పోరి ఫ్రెండ్సంతా నా చేతే బిల్లు పే చేయించిన సంఘటన జ్ఞాపకాని కొచ్చింది. ఆ టిఫిన్ చేస్తున్నంత సేపూ గురుమూర్తి చెప్పిన "నా కథ" అన్నమాటే నాలో సుళ్ళు తిరిగింది.

అయితే ఒక్కటిమాత్రం చెప్పగలను. కృతజ్ఞతని సూచించేమాట-ఒక్కటంటే ఒక్కటీ-అనలేదే మనతో అనే ఆ ఒక్క భావం తప్ప మరెల్లాంటి భావము కలగలేదు నాకు గురుమూర్తిమీద. అతనిపట్ల మునుపున్న అభిమానము తగ్గలేదు.

ఇది జరిగిన ఓ పది రోజులకంతా టైపు చేసిన ఉత్తరం ఒకటి పట్టుకొచ్చేడు గురుమూర్తి. నే (?) రాసిన ఆ రెండో కథనీ వేసుకుంటున్నామని పత్రికవాళ్ళు పంపిన ఇంటిమేషన్ అది. ఉప్పొంగిపోతూ చూపించేడు గురుమూర్తి.

ఆ రోజున మేం [illegible]

పట్టుకెళుతూ నన్నుచూసి కన్నుమెదిపి మరీ వెళ్ళింది అపర్ణ అంటే గురుమూర్తి కథవిషయం కదిపితే మొహమాటం కోసం అనవసరంగా రాసేపని పైన వేసుకో వద్దని ఆమె సూచన!

గురుమూర్తి కాఫీతాగి అక్కడే నేను చదువుతూ పడేసిన పుస్తకాన్ని పట్టుకుని అటూ ఇటూ తిప్పుతూ ఏదో చెప్పడానికి తటపటాయిస్తున్న వాడల్లె కనిపించేడు. ఏదో ఓ కథకోసం ప్లాట్ పట్టుకొచ్చి వుంటాడనే అనుకున్నానేను అతని వాలకం చూసి

నిజంగా అదే అన్నాడు గురుమూర్తి "గురూగారూ! బ్రహ్మాండమైన ప్లానొకటి తట్టిందండీ నేనే దాన్ని రాసేనుగాని అది అంత బాగా రావడం లేదండీ!"

అంటూ నామొహంలోకి చూసేడు

చూసి క్షణం ఆగేడు.

"ప్లాట్ నీది కన్‌స్ట్రక్షన్ నాదయితే మనిద్దరి పేర్లూ పెడదాం ఆ బిల్డింగుకి" అన్నాన్నేను జోక్‌లాగానే

"దానికేం భాగ్యం! అల్లాగే కానివ్వండి" అన్నాడు.

నే నా కథని రాసేను కథకి మా ఇద్దరి పేర్లూ తగిలించేను

మరికొన్ని రోజులకి ముందు వెనకగా మొదటి రెండు కథలకీ మరియాద్లొచ్చేయి గురుమూర్తికి టిప్పుటాప్‌గా డ్రెస్ ఒకటి కుట్టించేసేడు గురుమూర్తి ఆ డబ్బులతో ప్యాంటుకొకటి, చొక్కాకొకటి ఆ కథల ఖాతాకు పేర్లే పెట్టి నవ్వుకోడం సాగించేను మిత్రులతో.

దాంతర్వాత ఈమధ్యే అంటే మా ఇద్దరి పేర్ల మీదుగా ఆ మూడో కథని రాసిన ఓ నెలన్నరకల్లా అది అచ్చుకావడం, దాని తాలూకు రెమ్యూనరేషన్ రావడం జరిగేయి ఇమ్మిడి ప్రతిఫలం కాబట్టి వూళ్ళో వున్న మిత్రులు నలుగురైదుగురికీ ప్రైడ్‌గా పార్టీ ఇవ్వడంతో దాన్ని సద్వినియోగం చేద్దాం అని తీర్మానించాడు గురుమూర్తి నేను మౌనంగా తల వూపేను

చిత్రం ఆ తర్వాత జరిగిందేమిటంటే ఒక్కటంటే ఒక కథనీ "ఇదండీ గురూగారూ! రాద్దామా?" అంటూ రాలేదు నా దగ్గరికి గురుమూర్తి ఏవో తనే రాసేవాడు పత్రికలకి పంపుకునేవాడు. ఆ సంగతి నాకూ తెలుస్తూనే వుంది. మా స్నేహం మామూలుగా సాగుతూనే వుంది అయితే చింతించవలసిన విషయం ఆపైన అతను పంపిన ఏ కథా అచ్చు కాకపోవడం!

"థీమ్‌లో ఏముందండీ! ఏదైనా రాసెయ్యొచ్చు దాన్ని కథలా 'ఫామ్' చెయ్యడం లోనే వుంది అసలు ప్రతిభంతా" అంది అపర్ణ తర్వాతెప్పుడో.

ఏది ఏమయినా ఫేర్ చేసి పత్రిక్కి పంపేముందు అతనికి చూపకుండా నేను పంపిన మొదటి కథ ఇదే, ఏకారణంచేత నేనీ కథను అతనికి చూపకుండా పంపేనో మీకిక వేరే చెప్పక్కర్లేదు.

ఇక పోతే ఈ కథని చదివి తనే ఇంతలో వస్తువయ్యేడని తెలుసుకున్న వెనక మొట్టమొదటిగా నా ఎదుటబడ్డప్పుడు మా గురుమూర్తి మొహం ఎల్లా వుంటుందో చూద్దామనే కుతూహలం వుండనే వుంది నాలో తీరా ఆ పరిస్థితే ఎదురయితే అప్పుడతన్ని ఎల్లా పలకరించాలా అనే సందిగ్ధంగా ఉంది ●